మాట్లాడుతున్న రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

ఐపీఎల్ మ్యాచ్‌లకు పటిష్ట బందోబస్తు

సిటీబ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ): ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఈ నెల 23వ తేదీ నుంచి మే 21 వరకు జరిగే 18వ ఎడిషన్ టాటా ఐపీఎల్ 2025 క్రికెట్ పోటీల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై సోమవారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, ఉప్పల్ స్టేడియం అధికారులు, సన్ రైజర్స్ టీమ్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్‌బాబు మాట్లాడుతూ క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంగా అన్ని రకాలైన సెక్యూరిటీ పరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భద్రతాపరమైన ఉల్లంఘనలు, అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇచ్చే ఎలక్ట్రానిక్ పరికరాలు, అగ్గిపెట్టెలు, ల్యాప్‌టాప్‌లు, పదునైన వస్తువులతో పాటు బయట నుంచి తెచ్చే తినుబండరాలు, వాటర్ బాటిల్స్ వంటి వాటిని స్టేడియంలోకి అనుమతించకూడదని అధికారులను ఆదేశించారు. భారీ సంఖ్యలో క్రికెట్ అభిమానులు హాజరయ్యే అవకాశం ఉండటంతో కార్లు, ద్విచక్రవాహనాలకు సంబంధించిన పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని, సాధారణ వాహనదారుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఉప్పల్ రహదారిపై ట్రాఫిక్ రద్దీ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్టేడియం చుట్టూ 450 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సివిల్, ట్రాఫిక్, రిజర్వు, పోలీస్, ఎస్ఓటీ విభాగాల అధికారులు, సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. టికెట్ల పంపిణీలో గందరగోళం లేకుండా చూడాలని ఐపీఎల్ బృందానికి సూచించారు. మల్కాజిగిరి డీసీపీలు పద్మజ, అరవింద్‌బాబు, ఇందిర, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి లేక విదేశాలకు వెళ్తే..

అక్కడా తప్పని మోసాలు

ఉద్యోగాలు, ఇంటర్వ్యూల పేరుతో నిలువునా దోచుకుంటున్న సైబర్ నేరగాళ్లు

ఉద్యోగాల పేరుతో సోషల్‌మీడియాలో ఎర

వాట్సాప్ కాల్స్‌లోనే సంప్రదింపులు

పాస్‌పోర్టులు సీజ్ చేస్తున్న మాఫియా

సిటీబ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ): సరైన ఉపాధి అవకాశాలు లేక పోవడంతో నిరుద్యోగ యువత ఎక్కడో ఓ దగ్గర ఉద్యోగం పొందాలని విదేశాలలో డాటా ఎంట్రీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూ సైబర్ మాఫియా చేతిలో చిక్కుతున్నారు. అక్కడకు వెళ్లిన నిరుద్యోగ యువత మాఫియా చెప్పినట్లు చేయలేదంటే..గంటల తరబడి ఎండలో నిలబెట్టటం.. కప్ప గంతులు వేయాలంటూ తదితర శిక్షలు విధిస్తూ చిత్ర హింసలకు గురిచేస్తూ తమ దారికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమవుతుండటంతో ఏదో ఒక ఉద్యోగం సాధించాలని అందుకు సోషల్‌మీడియా, తెలిసిన వారిపై ఆధారపడుతున్నారు. కుటుంబాలను ఆర్థికంగా నిలబెట్టడంతో పాటు, తాము కూడా ఉద్యోగం చేయాలంటే ఎక్కడైతే ఏంటి అనే ధోరణితో తెలిసి, తెలియక చాలా మంది విదేశాల నుంచి నిర్వహించే సైబర్ మాఫియా చేతిలో చిక్కుకొని ఆయా డెన్‌లలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డాటా ఎంట్రీ పేరుతో విదేశాలలో ఉద్యోగాలంటూ సోషల్‌మీడియాలో ప్రకటనలు ఇస్తూ చైనా సైబర్‌నేరగాళ్లు భారతదేశంలో ఉండే యువతను ఆకర్షిస్తున్నారు. వాట్సాప్, టెలిగ్రామ్‌లతోనే సంప్రదింపులు జరుపుతూ, ఇక్కడి వారి టైపింగ్ స్పీడ్, ఇంగ్లిష్ స్పీకింగ్ స్కిల్స్‌ను తెలుసుకొని ఎంపికయ్యావంటూ విదేశాలకు పిలిపించుకుంటూ సైబర్‌నేరాలలో శిక్షణ ఇప్పిస్తున్నారు. అక్కడకు వెళ్లిన వారితో అగ్రిమెంట్లు చేసుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా ఉండే ఆయా దేశాలలోని అమాయక పౌరులను ఏదో ఒక విధంగా మాయలో వేసి డబ్బు సంపాదించే సైబర్ నేరాలలో ఉద్యోగాలు చేయిస్తున్నారు. దుబాయ్, కంబోడియా దేశాలలో గతంలో సైబర్ మాఫియా చేతిలో చిక్కుకున్న తెలుగురాష్ట్రాలకు చెందిన పలువురు గతేడాది మే నెలలో విడుదలయ్యారు. ఇటీవల థాయిలాండ్, మయన్మార్ సరిహద్దులలో భారీ ఎత్తున జరుగుతున్న సైబర్‌మాఫియాకు సంబంధించిన పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. అక్కడ చిక్కుకున్న తెలంగాణకు చెందిన పలువురు యువకులను అక్కడి సైన్యం ఆ మాఫియా నుంచి కాపాడి భారత్‌కు పంపించిన విషయం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దీనిపై తెలంగాణ సైబర్‌సెక్యూరిటీ పోలీసులు కేసులు సైతం నమోదు చేశారు.

ఇక్కడ ఉద్యోగాలు లేకనే..

ఇక్కడ ఉద్యోగాలుంటే తమకెందుకు ఈ కర్మ అంటూ పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలతో రియల్ ఎస్టేట్ కుప్పకూలింది. ఇలాంటి పరిస్థితులలో రోజు రోజుకు నిరుద్యోగం పెరిగిపోతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ కొత్త కంపెనీలు వచ్చి ఉద్యోగ అవకాశావాలు వస్తే విదేశాలలో చిన్న చిన్న ఉద్యోగాల కోసం వెళ్లే పరిస్థితి ఉండదని నిరుద్యోగ యువత ఆవేదన వ్యక్తం చేస్తుంది. చిన్న చిన్న ఉద్యోగాలు ఎక్కడైతే ఏంది జీతం ఇచ్చేవాళ్లు కావాలనే భావనతో ముందుకెళ్తే సైబర్‌కేటుగాళ్ల వలలో చిక్కుకుంటున్నామని, అక్కడకు వెళ్లి సైబర్‌నేరగాళ్లుగా తయారు కావాల్సి వస్తోందంటూ వాపోతున్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు విదేశాలలో ఉద్యోగాలంటూ సోషల్‌మీడియా వేదికగా జరిగే ప్రచారాలపై నిఘాపెట్టి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలంటూ ప్రజలు కోరుతున్నారు.

సోషల్‌మీడియా వేదికగా..

ఇటీవల పలువురు యువకులు ఈ సైబర్‌మాఫియా నుంచి తప్పించుకొని తిరిగి వచ్చారు. అందులో కొందరు డిగ్రీ వరకు చదువుకొని ఉద్యోగం కోసం ఇక్కడ ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. డిగ్రీ అయిపోయి ఇంకా తల్లిదండ్రుల మీద ఆధారపడడం కంటే హైదరాబాద్‌లో మరో ప్రాంతంలోను ఏదో ఒక ఉద్యోగం చేసి కుటుంబాన్ని పోషించే బాధ్యతలు తీసుకోవాలని భావించారు. ఇందులో సోషల్‌మీడియా ద్వారా కొందరికి థాయిలాండ్,మయన్మార్‌లో డాటా ఎంట్రీ ఉద్యోగాలు నెలకు రూ. 50 వేల నుంచి రూ. 75 వేల జీతం ఉంటుందంటూ సోషల్‌మీడియాలో పరిచయస్తులు చెప్పారు. మరికొందరు ఫలాన చోట ఉద్యోగాలున్నాయంటూ మనకు తెలిసిన వారు చేస్తున్నారంటూ సూచనలు రావడంతో ఆయా నంబర్లలో బాధితులు సంప్రదించారు. డాటా ఎంట్రీ ఉద్యోగం కోసం పలువురు సోషల్‌మీడియా, పరిచయస్తుల ద్వారా చైనా సైబర్‌నేరగాళ్లను సంప్రదించారు. టైపింగ్ స్పీడ్ టెస్ట్ చేసి, చైనీయులు ఫోన్లో ఇంటర్వ్యూలు సైతం చేశారు. నేరుగా సోషల్‌మీడియాలో పరిచయం అయిన వారికి కొందరికి టికెట్టు ఖర్చు చైనా సైబర్‌నేరగాళ్లు పెట్టుకోగా మరికొందరిని టికెట్ తీసుకొని బ్యాంకాక్ రావాలంటూ సూచనలు చేశారు.అలాగే తెలిసిన వారి ద్వారా ఉద్యోగాలకు ప్రయత్నిస్తే రూ. 60 వేల వరకు బాధితుల వద్ద వసూలు చేసి అందులో కొంత కమీషన్ తీసుకొని, మరి కొంత టిక్కెట్టుకంటూ వెచ్చించి పంపించారు. టికెట్లు తీసుకొని బ్యాంకాక్ వెళ్లిన తరువాత సైబర్‌నేరగాళ్లు బాధితుల కోసం కారు బుక్‌చేసి తమ మనుషుల ద్వారా థాయిలాండ్ సరిహద్దులో మయన్మార్ భూభాగంలో ఉండే సైబర్ దోపిడీకి చెందిన కార్యాలయాల వద్దకు తీసుకెళ్లారు. అక్కడ బాధితుల వద్ద నుంచి పాస్‌పోర్టులు లాక్కొని, ఒక సంవత్సరం కాంట్రాక్టు, మధ్యలో జాబ్ వదిలేస్తే 4 వేల డాలర్ల జరిమానా చెల్లించాలంటూ కండీషన్లు పెట్టి సైబర్‌నేరాలు చేసే ఉద్యోగం ఇచ్చారు. మోసం చేయడంలో మంచి నేర్పరితనం ఉన్న వారికి ప్రోత్సహకాలు ఇవ్వడం, మోసం చేయలేక బాధపడుతున్న వారిపై చిత్రహింసలకు గురిచేయడం, ఎండలో నిలబెట్టడం, కప్పగంతులు వేయించడం వంటివి చేస్తూ బలవంతంగా సైబర్‌నేరాలు చేయించే వారని బాధితులు తెలిపారు.

ఐఫోన్లను చూపుతున్న శంషాబాద్ జోన్ డీసీపీ రాజేశ్

ఐఫోన్లు తరలిస్తున్న మహిళలు అరెస్టు

శంషాబాద్ రూరల్, మార్చి 17: విదేశాల నుంచి అక్రమంగా ఐఫోన్లు తరలిస్తున్న ఐదుగురు మహిళలను అరెస్టు చేసినట్లు శంషాబాద్ డీసీపీ రాజేశ్ తెలిపారు. సోమవారం యూఏఈ నుంచి 6ఈ- 1496 నంబర్‌గల విమానంహైదరాబాద్(శంషాబాద్) ఎయిర్‌పోర్టుకు ఉదయం 7.30 నిమిషాలకు చేరుకుంది. విదేశాల నుంచి కొందరు మహిళలు అక్రమంగా ఫోన్లు తీసుకువస్తున్నట్లు పక్కా సమాచారంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు అవుట్‌పోస్టు సీఐ బాలరాజు సదరు మహిళలను అదుపులోకి తీసుకొని వారి బ్యాగులను తనిఖీ చేయగా వారి వద్ద 10 ఐఫోన్లు దొరికాయి. మహిళలు రిజ్వాన బేగం, సభాకన్నం,ఉమ్మర్‌బేగం, సుప్రియ కన్నం, లాసిఉన్నీసాలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తాళాలు పగులగొట్టి చోరీ

మన్సురాబాద్, మార్చి 17: షట్టర్ తాళాలు పగలగొట్టి ఫర్నిచర్ షాప్ లోకి చొరబడ్డ గుర్తు తెలియని వ్యక్తులు రూ. 50 వేల నగదును అపహరించుకుపోయిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్బీనగర్, చింతలకుంట చెక్ పోస్ట్, సరస్వతి నగర్ కాలనీకి చెందిన చెర్క సాయికిరణ్ ఎల్బీనగర్ కామినేని నుంచి ఉప్పల్ వెళ్లే మార్గంలోని శివగంగా కాలనీ ప్రధాన రహదారిపై పది సంవత్సరాలుగా షిరిడి సాయి ఎంటర్ ప్రైజెస్ పేరుతో ఫర్నిచర్ షాప్‌ను నడుపుతున్నాడు. ఈ నెల 16న రాత్రి షాపును మూసివేసి ఇంటికి వెళ్లాడు . మరుసటి రోజు సోమవారం ఉదయం షాపు వద్దకు రాగా షటర్ కొద్దిగా తీసి ఉంది. వెళ్లి బీరువాను పరిశీలించాడు. గుర్తుతెలియని వ్యక్తులు షాపులోకి ప్రవేశించి బీరువా ను ఓపెన్ చేసి అందులోని నగదును అపహరించినట్లు గుర్తించాడు. బాధితుడు సాయికిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం కొనుగోలుకు వెళితే కారు..

ఖైరతాబాద్, మార్చి 17 : వైన్ షాపులో మద్యం కొనుగోలు చేసేందుకు వెళితే పార్క్ చేసి ఉన్న కారును ఓ గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట లీలానగర్ కు చెందిన తోట ప్రసాద్ ఆదివారం రాత్రి తన ఎంజీ హెక్టార్ కారులో సికింద్రాబాద్‌లోని దక్కన్ క్లబ్ హోటల్‌కు వెళ్లాడు. డిన్నర్ పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణమయ్యాడు. ఇంటికి వెళ్తూ దారి మధ్యలో బేగంపేట హోటల్ గ్రీన్ పార్కు ఎదురుగా ఉన్న రిలాక్స్ సంధ్య వైన్స్ లో మద్యం కొనుగోలు కోసం కారును షాపు ఎదుట పార్క్ చేసి వెళ్లగా, గుర్తుతెలియని వ్యక్తి కారును తీసుకొని వెళ్లిపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

కీసర, మార్చి 17: ఓ వ్యక్తి మరో వ్యక్తిని కత్తితో దాడి చేసిన కేసులో నేరస్తుడికి మల్కాజిగిరి జడ్జి జీవితఖైదు విధించారు. కీసర సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని గోధుమకుంటలో గోధుమకుంటలోని నూర్ ఫీడ్ సెంటర్‌లో కోళ్లం ఫారం ఉంది. కూలీలుగా ఒడిశాకు చెందిన బబ్లూనాయక్, కబిచంద్ర పనిచేస్తున్నారు. డీసీఎంలోంచి కోళ్లను దించే క్రమంలో చిన్నగా దింపుమని బబ్లూనాయక్ కబిచంద్రను మందలించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవైంది. కాగా సాయంత్రం బబ్లూనాయక్ ఇంటి దగ్గరికి కబిచంద్ర వచ్చి కత్తితో పొడిచాడు . దవాఖానకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఆయన మృతి చెందాడు. పోలీసులు కబిచంద్రను అరెస్టు చేసి రిమాండ్ చేశారు. ఈ కేసులో మల్కాజిగిరి జడ్జి బాల భాస్కర్ విచారించి సోమవారం కబిచంద్రకు జీవిత ఖైదీ విధించారు. ఈ కేసులో గవర్నమెంట్ ఫీడర్ యాదగిరి ప్రాసిక్యూషన్ తరపున సాక్షులను ప్రొడ్యూస్ చేశారు.

పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు

సిటీబ్యూరో, మార్చి17 (నమస్తే తెలంగాణ) : ఈనెల 21నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు పదోతరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పోలీస్‌శాఖ పరంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 357 పరీక్షాకేంద్రాల వద్ద బీఎన్ఎస్ సెక్షన్ 163(పాత 144 సెక్షన్) అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పరీక్షాకేంద్రాలకు ఐదు వందల మీటర్ల దూరం వరకు ఎవరూ గుమికూడదని,ఈ సెక్షన్ 21వ తేదీ ఉదయం ఆరుగంటల నుంచి ఏప్రిల్ 5వతేదీ ఉదయం ఆరుగంటల వరకు అమలులో ఉంటుందని ఆయన తెలిపారు. విద్యార్థులంతా పరీక్షలు విజయవంతంగా రాయాలని, ఏవైనా సెక్యూరిటీ పరంగా అనుమానాలు తలెత్తితే స్థానికంగా ఉన్న పోలీస్‌లను సంప్రదించాలని సివి ఆనంద్ సూచించారు.

శంషాబాద్ విమానశ్రయ రైడ్స్ రద్దు

సిటీబ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : ఓలా, ఉబర్, ర్యాపిడో క్యాబ్ డ్రైవర్లు శంషాబాద్ విమానశ్రయ రైడ్స్‌ను రద్దు చేస్తున్నారు. కంపెనీలు దూరానికి తగిన ధర చెల్లించడం లేదంటూ పది రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలంగాణ క్యాబ్ అసోసియేషన్ అధ్యక్షుడు సలావుద్దీన్ తెలిపారు. రైడ్ ధరలు డ్రైవర్లకు లాభం చేకూరేలా లేవని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే ఒక యాప్ తీసుకొచ్చి ఆదుకోవాలని కోరారు. ఇప్పటి వరకు 48వేల మంది డ్రైవర్లు నిరసనలో పాల్గొన్నట్లు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

సిటీబ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ): భువనేశ్వర్ నుంచి ముంబైకి కోణార్క్ రైల్లో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.5లక్షల విలువ చేసే 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఎస్‌టీఎఫ్ సీఐ నాగరాజు కథనం ప్రకారం...ఒడిశాకు చెందిన దాంపాప్రధాన్ వృత్తిరీత్యా గంజాయి వ్యాపారి. ఒడిశాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రలోని ముంబైలో అధిక ధరలకు విక్రయిస్తాడు. ఈ క్రమంలో ఒరిస్సా నుంచి ముంబైకి గంజాయిని తరలించాలని నందిగోస నాహక్ అనే వ్యక్తికి సూచించాడు. రూ.15వేలు చెల్లిస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. అందుకు నాహక్ అంగీకరించడంతో అతడికి 10 కిలోల గంజాయిని అప్పగించి ముంబైకి డెలివరీ చేయాల్సిందిగా సూచించాడు. అయితే కోనార్క్ రైలులో పోలీసుల తనిఖీలు జరుగుతున్నాయనే సమాచారం అందడంతో వెంటనే ఆ రైలు దిగి కాకతీయ రైలు ఎక్కాడు. కాకతీయ రైల్లో కూడా తనిఖీలు జరుగుతున్నాయనే భయంతో ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌లో గంజాయితో పాటు దిగిపోయాడు. అక్కడి నుంచి బస్సు మార్గంలో లేదా మరో రైల్లో ముంబైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా అప్పటికే సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ సీఐ నాగరాజ్ , ఎస్సై జ్యోతి, ఇతర సిబ్బందితో కలిసి నాహక్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.

యువతి విషయంలో గొడవ..కేసు

బంజారాహిల్స్, మార్చి 17 : తనకు పరిచయం ఉన్న యువతి విషయంలో అడ్డు వస్తున్నాడన్న కక్షతో టీవీ చానల్ రిపోర్టర్ పై దాడి చేయడంతో పాటు అంతు చూస్తా నంటూ బెదిరింపులకు గురి చేస్తున్న ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఫిలింనగర్ లో నివాసం ఉంటున్న బాపురాం శశి అనే వ్యక్తి ఓ టీవీ చానల్ లో విలేకరిగా పనిచేస్తున్నాడు. తనకు తెలిసిన ఓ యువతిని ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన శ్రీకాంత్ వెంటపడి ప్రేమ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. నీ విషయాన్ని యువతి శశి కి చెప్పింది. దీంతో శశి ఇటీవల శ్రీకాంత్ ను మందలించాడు. కక్ష పెంచుకున్న శ్రీకాంత్ ఈనెల రెండు తేదీన అపోలో ఆసుపత్రి వద్ద అడ్డుకొని దాడి చేశాడు. నా జోలికి వస్తే అంతు చూస్తానంటూ హెచ్చరికలు జారీ చేశాడు. గత నెల 24న శశి ఇంటి ముందు పార్కు చేసిన బైకును ధ్వంసం చేశారు. అది కూడా శ్రీకాంత్ చేసి ఉంటాడని అతడి వల్ల తనకు ప్రాణ హాని ఉందంటూ బాధితుడు శశి కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు ఫిలింనగర్ పోలీసులు నిందితుడు శ్రీకాంత్ మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హెచ్‌సీయూ వీసీతో జేఏసీ సమావేశం

ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చ

సిటీ బ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు భూముల వేలం నిర్ణయంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా భవిష్యత్ కార్యాచరణను వేగవంతం చేశారు. 400 ఎకరాల భూముల వేలాన్ని అడ్డుకునేందుకు చేట్టాల్సిన కార్యక్రమాలపై వర్సిటీ వీసీతో సోమవారం సమావేశమయ్యారు. భూముల అమ్మకాన్ని ఆపాలని ప్రభుత్వంతో చర్చించాలని వీసీని కోరారు. యూనివర్సిటీ భూములను కోల్పోతే భవిష్యత్ అంధకారమవుతుందని వివరించారు. వర్సిటీ ఎదుగుదలకు ఆటంకం ఏర్పడుతుందని, భూముల వేలాన్ని ఆపేందుకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాము చేపడుతున్న, భవిష్యత్‌లో చేపట్టబోయే నిరసన కార్యక్రమాలకు సహకరించాలని జేఏసీ తరపున విన్నవించారు. క్యాంపస్‌లో చేపట్టబోయే ఆందోళనలపై జేఏసీ నేతలు వీసీతో చర్చించారు. ఆందోళనలు, నిరసన కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. తమ అభ్యర్థనకు వీసీ సానుకూలంగా స్పందించారని జేఏసీ ప్రతినిధులు తెలిపారు.వీసీతో నేడు మరోసారి సమావేశమవుతామని వెల్లడించారు.

నిందితుడి కోసం గాలింపు చర్యలు

జూబ్లీహిల్స్ రోడ్ నెం 56లోని ఎంపీ డీకే అరుణ నివాసం వద్ద పరిశీలిస్తున్న సీపీ సీవీ ఆనంద్

బంజారాహిల్స్,మార్చి 17: బీజేపీ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ఇంట్లో ఆగంతకుడు ప్రవేశించిన ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 56లోని ఎంపీ డీకే అరుణ నివాసంలోకి ప్రవేశించిన ఆగంతకుడు గంటపాటు ఇంట్లోనే రెక్కీ నిర్వహించిన విషయాన్ని గురించి ఫిర్యాదు అందుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఇంటి వెనకాల కిటికీ గ్రిల్ తొలగించి లోనికి వచ్చిన ఆగంతకుడు సీసీ కెమెరాల లైన్‌ను కట్ చేయడాన్ని చూస్తుంటే గతంలో ఇంట్లో పనిచేసిన వ్యక్తి కావచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. సీసీ కెమెరాలోని ఫుటేజీతో పాటు ఆ సమయంలో సెల్‌ఫోన్ టవర్ లొకేషన్‌ను విశ్లేషిస్తున్నారు. ఎంపీ ఇంటి ముందు రోడ్డుతో పాటు వెనకాల నుంచి రోడ్డు మీదకు వచ్చే దారులపై సీసీ కెమెరా ఫుటేజీని సేకరిస్తున్నారు. ముఖానికి మాస్కులు వేసుకోవడం, చేతులకు గ్లౌజులు, కాళ్లకు షూస్ వేసుకుని రావడాన్ని గమనిస్తే అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు అర్థమవుతోంది. దొంగతనం కోసం వచ్చి అలికిడి అయిన తర్వాత పారిపోయి ఉంటాడా అనే కోణంలో కూడా పోలీసుల విచారణ కొనసాగుతోంది.

సంఘటన స్థలంలో కమిషనర్ సీవీ ఆనంద్..

ఎంపీ డీకే అరుణ ఇంట్లోకి ఆగంతకుడు ప్రవేశించిన ఘటన సంచలనంగా మారడంతో సోమవారం నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ జూబ్లీహిల్స్‌లోని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడు వచ్చిన మార్గాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తు జరుగుతున్న తీరుతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు అందజేశారు. జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరితో పాటు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డిలతో మాట్లాడి భద్రతను పెంచాలని ఆదేశించారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో ఇద్దరి అరెస్ట్

బంజారాహిల్స్,మార్చి 17: రాంగ్‌రూట్‌లో వచ్చి ప్రమాదానికి కారణం కావడమే కాకుండా బైక్ నడిపిస్తున్న వ్యక్తిపై దాడి చేసి డబ్బులు ఎత్తుకెళ్లిన వారిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ రోడ్ నెం 13లో నివాసం ఉంటున్న రాఘవేంద్ర అనే యువకుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుంటాడు. ఈనెల 15న అర్ధరాత్రి దాటిన తర్వాత మాదాపూర్‌లో సెకండ్ షో సినిమా చూసి బైక్‌మీద ఇంటికి బయలుదేరాడు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45నుంచి బాలకృష్ణ ఇంటివద్ద కుడివైపునకు తిరిగే సమయంలో రాంగ్‌రూట్‌లో వచ్చిన ఆటో బైక్‌ను ఢీ కొట్టింది. ఆటోడ్రైవర్‌ను రాఘవేంద్ర ప్రశ్నించాడు. దీంతో ఆటోడ్రైవర్ బూతులు తిట్టడంతో పాటు బైక్‌ను ఫాలో చేస్తూ కొంతదూరం వెంబడించి ఆటోను అడ్డుపెట్టారు. రాడ్‌తో దాడి చేసి కేసు పెడ్తానంటూ బెదిరించి రూ.5వేలు వసూలు చేశాడు. అతడితో పాటు మరో వ్యక్తి జుబైర్ రాఘవేంద్రకు సాయం చేస్తున్నట్లు నటించి మరో రూ.1000 వసూలు చేశాడు. బాధితుడు సోమవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో ఆటోడ్రైవర్ వీరప్ప నాయక్‌కు జుబైర్ స్నేహితుడు అని తేలింది. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్ రెడ్డి, క్లూస్ టీం

పసికందును తగులబెట్టారు..

కవాడిగూడ, మార్చి 1: అప్పుడే పుట్టిన పసికందును ఎన్టీఆర్ స్టేడియంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించి తగులబెట్టారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి క్లూస్ టీంను పిలిపించి ఆధారాలను సేకరించారు. అప్పుడే పుట్టిన ఆడ శిశువుగా ప్రాథమికంగా గుర్తించారు. బతికుండగానే పసికందును కాల్చేశారా, మృతిచెందిన పసికందు ఆధారాలు లేకుండా చేసేందుకు ఇక్కడికి తీసుకువచ్చి తగులబెట్టారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి

మల్కాజిగిరి, మార్చి 17: భవనంపై నుంచి కార్మికుడు కిందపడి మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఇన్స్పెక్టర్ రాహుల్‌దేవ్ వివరాల ప్రకారం.. వెంకటసాయినగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనంలో ఉదయం నుంచి కార్మికులు పని చేస్తున్నారు. ప్రమాదవశాత్తు కార్మికుడు రాజు కిందపడగా అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

GOLD FINANCE

★మీ బం